క్లుప్తంగా

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

పెదపూడి: యువత రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని అనపర్తి జీబీఆర్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ అబ్బాయిరెడ్డి అన్నారు. రోటరీ క్లబ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టిఆర్ఎల్ స్వామి, రోటరీ క్లబ్ వైద్యుడు కామరాజు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్ స్వామి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు సీహెచ్ ఆనందరావు, పీవీ వెంకటేశ్వరరావు, కె.రామకృష్ణ, అధ్యాపకులు ఆదినారాయణ, సుధాకర్ రెడ్డి, నాగమణి, శ్రీవల్లి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

11న గౌరీ శంకరుల రథోత్సవం

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలోని చెరువుగట్టుపైన కొలువుదీరిన గౌరీ శంకరుల రథోత్సవాన్ని ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ నాయకులు తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారీ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

తహసీల్దార్‌గా అనసూయ బాధ్యతల స్వీకరణ



రంగంపేట: రంగంపేట తహసీల్దార్‌గా కోసు అనసూయ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రంజిత్‌కుమార్ సెలవుపై వెళ్లడంతో ఆమెకు (ఎఫ్‌ఏసీ) బాధ్యతలు అప్పగించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక, రెవెన్యూ గ్రామసభలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆమెను ఇక్కడ అత్యవసరంగా నియమించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ట్రూత్ వివేకామృతం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆత్మజ్ఞాన ప్రబోధకులు వివేకానంద

బిక్కవోలు: ట్రూత్ వివేకమృతం క్యాలెండర్‌ను ట్రూత్ స్పిరిట్యువల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు, ఆత్మ జ్ఞాన ప్రబోధకులు వివేకానంద శుక్రవారం ఆవిష్కరించారు. మండలంలోని బలభద్రపురం గ్రామంలోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ట్రూత్ వివేకామృతం ఆధ్యాత్మిక విజయోత్సవం వేడుకలు ఆరవ రోజు వైభవంగా సాగాయి. వివిధ దేశాల సాధకులు వచ్చి ప్రవచనాలు శ్రద్ధగా విన్నారు. కార్యక్రమంలో సాధకులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఆరుగురిపై కేసు

సీతానగరం: మండలంలోని కాటవరంలో పేకాడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ గురువారం తెలిపారు. గ్రామ శివారున పేకాడుతుండగా సిబ్బందితో దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.17,650 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చుతామని తెలిపారు.

కరెంట్ షాక్‌తో గొర్రెల కాపరి మృతి

బిక్కవోలు: మండలంలోని రంగాపురం శివారులో సింగపల్లి గ్రామానికి చెందిన దుళ్ల సుబ్రహ్మణ్యం(38) కరెంట్ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ తెలిపారు. సింగంపల్లి గ్రామానికి చెందిన దుళ్ల సుబ్రహ్మణ్యం మేకలు మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం రంగాపురం శివారుల్లో పామాయిల్ తోటకు మేకలకు రొట్ట కోసేందుకు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తూ విద్యుత్తు వైరు తగలడంతో చెట్టు మీద నుంచి కిందకి పడిపోయాడు. అతడిని పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేటి నుంచి హజరత్ ఖకార్ష ఉరుసు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరంలోని గూడ్స్ షెడ్ వద్ద ఉన్న హజరత్ ఖకార్ష ఖాదరి ఔలియా ఉరుసు ఉత్సవాలు శుక్రవారం నుంచి మొదలుకానున్నాయి. ఈ విషయాన్ని దర్గా ఆర్గనైజర్, ముజావర్ షేక్ అల్లా బక్షీ, ముజావర్లు షేక్ మదీనా పాషా, షేక్ ఖాదర్ హుస్సేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం రాత్రి 9 గంటలకు గ్యార్మి ఫాతిహా అనంతరం పన్నీరు స్నానం ఉంటుందన్నారు. శనివారం ఉదయం 8 గంటలకు ఖురాన్ పఠనం, 8వ తేదీన ఉరుసు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా గుర్రం, ఫకీరు మేళాలతో ఊరేగింపు, అనంతరం గంధోత్సవం జరుగుతాయన్నారు. ఉదయం, సాయంత్రం మహన్నదానం నిర్వహిస్తామన్నారు. 9వ తేదీ రాత్రి 9 గంటలకు మిలాద్, దీపారాధన జరుగుతాయని తెలిపారు.

వెచ్చని నేస్తాలకు భలే గిరాకీ..!

- పల్లెల్లో పెరిగిన చలి తీవ్రత
- ఉన్ని వస్త్రాలను ఆశ్రయిస్తున్న జనం
- ఆకర్షణీయమైన డిజైన్లతో లభ్యం
- ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి విక్రయిస్తున్న వ్యాపారులు



అనపర్తి వంతెన వద్ద ఉన్ని దుస్తులు విక్రయిస్తున్న వ్యాపారి



అమ్మకానికి సిద్ధంగా ఉన్న రంగు రంగుల ఉన్ని దుస్తులు

బిక్కవోలు: శీతాకాలం కావడంతో చలిపులి పంజా విసురుతోంది. చీకటి ముసురు కుంటుండగానే చలి తీవ్రత పెరుగుతోంది. గ్రామాల్లో ఉదయం తొమ్మిది దాటినా మంచు వీడడం లేదు. చలి బారి నుంచి తమను తాము రక్షించుకునేందుకు ప్రజలు ఉన్ని వస్త్రాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల నుంచి ఇక్కడ ఉన్ని వస్త్రాలను విక్రయిస్తున్న వ్యాపారులకు భలే గిరాకీ పెరిగింది. రంగురంగుల రగ్గులు, మఫ్లర్లు, శాలువాలు, మంకీ క్యాప్‌లు, హ్యాండ్ గ్లౌజ్‌లు, స్వెటర్లు, ఇయర్‌కప్స్ వంటి వాటిని కొనుగోళ్లు చేసేందుకు జనం ఎగబడుతున్నారు. దీంతో అనపర్తి వంతెన వద్ద సందడి నెలకొంది. అనపర్తి మెయిన్‌రోడ్డు, బిక్కవోలు, జి.మామిడాడల్లో వీటి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.ఇతర రాష్ట్రాల వ్యాపారులు మూడు నెలల పాటు ఇక్కడ కశ్మీర్ ఉన్ని వస్త్రాలను విక్రయిస్తారు. నవంబరు, డిసెంబరు, జనవరి నెలలు వీరికి సీజన్ కాగా మొదటి రెండు నెలలు వ్యాపారం జోరుగా సాగుతుంది. సింగిల్ కాట్‌కు సరిపోయే రగ్గులు జత రూ.400ల నుంచి రూ.800ల వరకు విక్రయిస్తున్నారు. చిన్న పిల్లల స్వెటర్లు రూ.150ల నుంచి రూ.500ల వరకు ధరలు పలుకుతున్నాయి. మఫ్లర్లు, మంకీ క్యాప్‌లు రూ.30ల నుంచి రూ.80ల వరకు అమ్మకాలు చేస్తున్నారు.

తాత్కాలికంగా దుకాణాల ఏర్పాటు



మా ప్రాంతం నుంచి తెచ్చిన రగ్గులు, ఇతర ఉన్ని దుస్తులను స్థానికంగా మూడు నెలల పాటు విక్రయాలు చేస్తుంటాం. వంతెన రోడ్డు పక్క తాత్కాలికంగా దుకాణాలు పెట్టి అమ్ముతున్నాం. చాలా మంది కొనుగోళ్లకు ఆసక్తి కనబరుస్తారు. అమ్మకాలు ముగించుకుని తిరిగి ఫిబ్రవరి నెలలో మా స్వస్థలానికి వెళ్లిపోతాం.

మోతిలాల్, ఉన్ని దుస్తుల వ్యాపారి, మధ్యప్రదేశ్.

ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు



శీతాకాలంలో వీచే చలి గాలులకు జలుబు, జ్వరం తొందరగా వస్తాయి. చలి తీవ్రత నుంచి రక్షణ పొందేందుకు మంకీ క్యాప్‌లు, రగ్గులు, స్వెటర్ల వాడకం శ్రేయస్కరం. చిన్న పిల్లలు ఎక్కువగా చలి గాలిలో సంచరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

డాక్టర్.రామానంద్ సాగర్, చిన్న పిల్లల వైద్య నిపుణుడు, అనపర్తి.

10వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు

సీతానగరం: మండలంలో ఈ నెల పదో తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ ఆయా గ్రామాల సచివాలయాలలో ఈ సదస్సులు జరుగుతాయన్నారు. ఈనెల 10న ములకల్లంక సదస్సును బొబ్బిల్లంక సచివాలయం-2లో నిర్వహిస్తామని తెలిపారు. అలాగే 11న మిర్తిపాడు, 13న మునికూడలి, 16న రఘుదేవపురం, 18న చినకొండేపూడి, 20న కాటవరం, జాలిమూడి సదస్సులు కాటవరం సచివాలయంలో జరుగుతాయన్నారు. 21న సీతానగరం, 24న సింగవరం, 26న నాగంపల్లి, 28న నల్గొండ, రాపాక (రాపాక సచివాలయం), 30న వంగలపూడి, జనవరి 2న పురుషోత్తపట్నం, 3న ఉండేశ్వరపురం, 4న కూనవరం, 7న ముగ్గళ్ల, 8న బొబ్బిల్లంకలో జరుగుతాయన్నారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాలలో భూ సమస్యలపై రైతులు అర్జీలు అందజేయవచ్చన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజానగరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఎంహెచ్‌క్యూ ఫీడర్‌పై వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. రాజానగరంలో అన్ని రకాల వినియోగదారులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

ఓటేసిన ఉపాధ్యాయులు



రాజానగరంలో వెలుగు కార్యాలయం వద్ద పోలింగ్ కేంద్రం



సీతానగరంలోని పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు



కోరుకొండ మండలం కాపవరం ఎంఈవో కార్యాలయం వద్ద పోలీసులు, తహసీల్దార్

- ప్రశాంతంగా టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్
- పర్యవేక్షించిన అధికారులు

రాజానగరం/సీతానగరం/మధురపూడి: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలలోని ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి నియోజకవర్గంలో కేటాయించిన మూడు పోలింగ్ కేంద్రాలలో గురువారం ప్రశాంతమైన వాతావరణంలో పోలింగ్ జరిగింది. నియోజకవర్గంలో 215 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 208 మంది (96.74 శాతం) ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలాల వారీగా రాజానగరం మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని మండల మహిళా సమాఖ్య (వెలుగు) కార్యాలయం, కోరుకొండ మండలం కాపవరంలోని మండల విద్యాశాఖ కార్యాలయం, సీతానగరంలోని మండల తహసీల్దార్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరిగింది. సీతానగరం మండలంలో 23 మంది పురుషులు, 10 మంది మహిళలతో 33 మంది ఓటర్లు ఉండగా 32 మంది, కోరుకొండ మండలంలో 47 పురుషులు, 26 మంది మహిళలతో 73 మంది ఓటర్లు ఉండగా 71 మంది, రాజానగరం మండలంలో 64 మంది పురుషులు, 45 మంది మహిళలతో 109 ఓటర్లు ఉండగా 105 మంది ఓటు వేశారు.

పోలింగ్ కేంద్రాల కోసం వెతుకులాట

పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సమాచారాన్ని ఓటర్లకు తెలియజేయడంలో సంబంధిత అధికారులు పెద్దగా శ్రద్ధ చూపించలేదు. దీనితో ఓటు చేసేందుకు వచ్చిన పలువురు ఓటర్లు పోలింగ్ కేంద్ర ఎక్కడా అంటూ వాకబు చేసుకోవాల్సి వచ్చింది. కనీసం ఈ విధంగా వచ్చిన వారికి కేంద్ర ముంగిటనైనా ఫ్లెక్సీలు కనిపిస్తే కొంత ఇబ్బంది ఉండేది కాదు, అయితే అధికారులు ఈ ఫ్లెక్సీల విషయంలోనూ పొదుపు పాటించారు.

రంగంపేట: ఉమ్మడి గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రమైన రంగంపేట తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 99 శాతం పోలింగ్ నమోదైనట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ కోసు అనసూయ తెలిపారు. గురువారం ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా సాయంత్రం 4 గంటలకు ముగిసింది. మండలంలో మొత్తం 29 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉండగా 28 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని ఆమె తెలిపారు. కాగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బిక్కవోలు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 78 మంది ఓటర్లకు గానూ 75 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని ఏఎస్పీ మురళీకృష్ణ, డీఎస్పీ భవ్య కిషోర్, ప్రత్యేకాధికారి విజయకుమారి, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పరిశీలించారు.

పెదపూడి: పెదపూడి మండల పరిషత్ కార్యాలయంలో ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక గురువారం ప్రశాంతంగా జరిగింది. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ సీతాపతిరావు మాట్లాడుతూ 144 మంది ఓటర్లకు గానూ 111 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని అన్నారు. కార్యక్రమంలో పీఓ ఎం.శ్రీనివాసు, ఏపీఓ బి.ప్రసన్నకుమార్, ఓపీఓలు ఉన్నారు.



రంగంపేటలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న తహసీల్దార్ అనసూయ



బిక్కవోలు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ మురళీకృష్ణ

పెదపూడి: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ ప్రక్రియ గురువారం అనపర్తి మండలంలో ప్రశాంతంగా జరిగిందని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి అనిల్ కుమార్ తెలిపారు. ఆయన అనపర్తిలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. మండలంలో 108 మంది ఓటర్లకు గానూ 98 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు.

షష్ఠి ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు



కోరుకొండలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం



ముగ్గళ్లలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద జరుగుతున్న ఏర్పాట్లు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం, ముగ్గళ్ల గ్రామాల్లోని వల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు శనివారం జరిగే షష్ఠి ఉత్సవాలకు ముస్తాబవుతున్నాయి. వాటిని విద్యుద్దీపాలతో అందంగా అలంకరిస్తున్నారు. ముగ్గళ్లలో రంగుల రాట్నాలు తదితర వాటిని ఏర్పాటు చేస్తున్నారు. సీతానగరంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, ముగ్గళ్లలోని ఉమా కొమరేశ్వరస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల వద్ద షష్ఠి మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. స్వామివారి కల్యాణం శుక్రవారం రాత్రి ఘనంగా జరుపుతారు. ముగ్గళ్లలో ఉత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని దేవదాయ ధర్మదాయశాఖ కార్యనిర్వాహణాధికారి పాటి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని రఘుదేవపురం, కాటవరం, మునికూడలి, కూనవరం తదితర గ్రామాల్లో షష్ఠి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి.

కోరుకొండలో..

మధురపూడి: కోరుకొండలోని వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో షష్ఠి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ఆలయంలో శనివారం నుంచి ఐదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని ముస్తాబు చేశారు. చుట్టు పక్కల చెత్తా చెదారాన్ని పంచాయతీ పారిశుధ్య కార్మికులు శుభ్రం చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కావిడి ఉత్సవం

పెదపూడి: అనపర్తిలో వీర్రాజు మామిడి వద్ద వేంచేసి యున్న కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కావిడి ఉత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు చందుశర్మ ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం సుబ్రహ్మణ్య స్వామి మాలాధారణ గావించిన భక్తులు సుబ్రహ్మణ్యం కావిడి భుజాన ధరించి పేటతుళ్లి ఆడుతూ స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు. అడుగడుగునా మహిళలు దీక్షాధారులు పాదాలకు పసుపు నీళ్లు జల్లుతూ స్వాగతం పలికారు. రథంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కోలాట నృత్యాలు, కేరళ డప్పు వాయిద్యాలు నడుమ స్వామి వారిని గ్రామంలో ఊరేగించారు.

లోక రక్షణకే ఏసుక్రీస్తు జననం

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: లోక రక్షణకే ఏసుక్రీస్తు జన్మించారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి గ్రామంలో పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు జన్మదినం మానవాళికి ఒక పండుగ దినంగా అభివర్ణించారు. క్రీస్తు బోధనలు అనుసరణీయమైనవని, వాటిని పాటించడం వల్ల ప్రతి ఒక్కరూ సన్మార్గంలో ముందుకు సాగుతారన్నారు. పెద్దలు, చిన్నారులచే ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం మాజీ ఎమ్మెల్యేకు ఫెలోషిప్ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొండేటి భీమేష్, వైస్ ఎంపీపీ కర్రి ఏసుదాసు, పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



అనపర్తిలో సూర్యనారాయణరెడ్డిని సన్మానిస్తున్న పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు

భూసార పరిరక్షణ మనందరి బాధ్యత

- కేవీకే ప్రధానాధికారి నాయుడు
- ఘనంగా ప్రపంచ నేలల దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నాయుడు

రాజానగరం: భూసారాన్ని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత అని కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు అన్నారు. కేవీకేలో గురువారం రైతులతో కలిసి ప్రపంచ నేలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డాక్టర్ నాయుడు మాట్లాడుతూ నేల స్వరూపాన్ని, స్వభావాన్ని, పోషకాలను కాపాడుతూ చేపట్టాల్సిన నిర్వహణపై అవగాహన కలిగించారు. అధిక దిగుబడులు సాధించాలనే తపనతో మోతాదుకు మించి ఎరువులు, పురుగుమందులను ఇష్టానుసారంగా వాడటం వలన భూసారం దెబ్బతింటుందని అనేక అధ్యయనాలు తెలియజేస్తున్నాయన్నారు. భావితరాలకు ఆరోగ్యవంతమైన, సారవంతమైన భూములను అందించడం మనందరి బాధ్యత అని గుర్తు చేశారు. ఇష్టానుసారంగా రసాయన ఎరువులను వినియోగించడాన్ని మానివేసి, ఆరోగ్యవంతమైన పంటలను పండించేలా సేంద్రియ ఎరువులను వాడుకోవాలన్నారు. గ్లోబల్ వార్మింగ్‌ను కట్టడి చేయడానికి ఆరోగ్యవంతమైన నేలలు ఉపయోగపడతాయన్నారు. అనంతరం రైతులకు భూసార పరీక్షా పత్రాలను అందజేశారు. సమావేశంలో కేవీకే సబ్జెక్ట్ స్పెషలిస్టులు డాక్టర్ బి.నాగేశ్వరరెడ్డి, డాక్టర్ రవీంద్ర, సాంటిక్కొ, ఎస్వీ రఘునందన్, సంజయ్ హెగ్డే, ఆర్.రత్నాజీ పాల్గొన్నారు.

జీజీయూలో..

రాజానగరం: గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ, వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ నేలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఓడీ బీవీవీ బలరామ్ భగత్ మాట్లాడుతూ బాధ్యతాయుతమైన పౌరులుగా భావితరాల కోసం భూసారాన్ని కాపాడటం మనందరి బాధ్యత అని గుర్తు చేశారు. దీనిలో భాగంగా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులతో చేసే వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో సహాయ అధ్యాపకులు ఎండీ హాజీమున్నీసా, విద్యార్థులు పాల్గొన్నారు.



జీజీయూలో మాట్లాడుతున్న హెచ్‌ఓడీ బలరామ్ భగత్

యాజమాన్య పద్ధతులు పాటించాలి

రాజానగరం: మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, భూసారాన్ని కాపాడుకునేలా సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులను అనుసరించాలని దివాన్ చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు సూచించారు. వ్యవసాయ శాఖ, ఏరువాక కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో దివాన్ చెరువులో రైతులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులతో కలిసి గురువారం ప్రపంచ నేలల దినోత్సవం నిర్వహించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ సమగ్ర పంటల సరళిని పాటిస్తే భూమి ఆరోగ్యాన్ని (సారాన్ని) కాపాడుకోవడంతో పాటు రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. జిల్లా ఇన్‌చార్జి ముఖ్య వ్యవసాయాధికారి ఎస్.జయరామలక్ష్మి మాట్లాడుతూ భూసార పరీక్ష విధానం - -ప్రయోజనాలు, సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువుల పంపిణీని వివరించారు. అనంతరం 'భూసార పరిరక్షణ మా బాధ్యత' అంటూ అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు.



దివాన్ చెరువులో మాట్లాడుతున్న ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ నరసింహారావు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

- జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు

పెదపూడి: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు అన్నారు. శుక్రవారం అనపర్తిలోని జీబీఆర్ స్కూల్ క్రీడా మైదానంలో ఇంటర్ స్కూల్స్ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. క్రీడా జ్యోతి ప్రజ్వలన చేసిన ఆయన 100 మీటర్ల పరుగు పోటీలను ప్రారంభించారు. పోటీల్లో విజేతలకు మెడల్స్ వేసి అభినందించారు. అనంతరం ఖోఖో, కబడ్డీ, టగ్ ఆఫ్‌వార్, త్రోబాల్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. క్రీడా స్ఫూర్తితో మెలగాలని అన్నారు. మూడు రోజులు పాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జీబీఆర్ గ్రూప్ స్కూల్ డీన్ జి.హరిప్రసాద్, హైస్కూల్ హెచ్‌ఎం రామారావు, ప్రైమరీ హెచ్‌ఎం భువనేశ్వరి, ప్రీ ప్రైమరీ హెచ్‌ఎం కామాక్షి, ఏసీ క్యాంపస్ హెచ్‌ఎం ఎం.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అనపర్తిలో క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు

సాగునీటి చెరువు అభివృద్ధికి తీర్మానం

బిక్కవోలు: మండలంలోని రంగాపురం గ్రామంలో గాజుల గొయ్యి చెరువును అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని కోరుతూ ఆయాకట్టు రైతులు తీర్మానం చేశారు. గురువారం చెరువు గట్టుపై దాల్వా సాగు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎత్తిపోతల సమాఖ్య అధ్యక్షుడు పుట్టా సోమన్న చౌదరి మాట్లాడుతూ గాజుల గొయ్యి చెరువు పూడికపై రైతులు ఆందోళన వ్యక్త చేస్తున్నారన్నారు. ఇలపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా గాజుల గొయ్యి చెరువుకు సాగునీరు అందుతుందని నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. స్వల్పకాలిక వరి వంగడాలను వాడాలని రైతులను కోరారు. అనంతరం ఎత్తిపోతల పథకం డైరెక్టర్లు కానాటి దుర్గాప్రసాద్, పోట్రు వాడపల్లి, చెల్లె జోషిబాబులు చెరువు అభివృద్ధిపై తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



రంగాపురంలో రైతులతో మాట్లాడుతున్న పుట్టా సోమన్న చౌదరి